క్లుప్తంగా

సీహెచ్‌సీలో అసిస్టెంట్ కలెక్టర్ తనిఖీలు


దాక్టర్లను వివరాలు అడిగి తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి

గోపాలపురం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)ను శుక్రవారం అసిస్టెంట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమ కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని వార్డులను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ప్రసూతి వార్డులు, ఆసుపత్రి పరిశుభ్రత, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా అందుతున్నాయని? అసిస్టెంట్ కలెక్టర్ రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగుల సంఖ్య పెరగాలని వైద్యులకు సూచించారు. డాక్టర్లు ఎం. చైతన్య, రాణి, దేవిశ్రీలు పాల్గొన్నారు.

గుడ్డిగూడెంలో వాటర్ ట్యాంక్ ప్రారంభం


గుడ్డిగూడెంలో సత్యసాయి మంచినీటి ట్యాంకును ప్రారంభిస్తున్న దాతలు

గోపాలపురం: స్థానిక గుడ్డిగూడెంలో నిర్మించిన సత్యసాయి మంచినీటి ట్యాంకును దాతలు కనుమూరి వెంకట్రాజు, లక్ష్మీ పతిరాజు శుక్రవారం ప్రారంభించారు. కనుమూరి పెద సత్యనారాయణ కుమారులైన వారిద్దరూ రూ.ఐదు లక్షల వ్యయంతో ఈ మంచినీటి ట్యాంకును నిర్మించారు. ఎస్సీ ఏరియాలో మరో ట్యాంకు నిర్మిస్తామని ఈ సందర్భంగా దాతలు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా గ్రామంలో తాగు నీటి ఎద్దడి ఉందని ట్యాంకు నిర్మాణంతో సమస్య తీరిందంటూ గుడ్డిగూడెం గ్రామస్తులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు బొర్రా ఆంజనేయులు, గోపాలపురం ఏఎంసీ వైస్ చైర్మన్ తోట నాగేశ్వరరావు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఇకపై రేషన్ కార్డుదారులకు పోర్టిఫైడ్ బియ్యం

కొవ్వూరు: చౌక దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేయనున్నట్టు ఆర్డీవో ఎస్.మల్లిబాబు ప్రకటించారు.రేషన్ బియ్యంపై వస్తున్న అపోహలు, వదంతులను నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తున్న పోర్టిఫైడ్ బియ్యం పోషక విలువలు కలిగి ఉంటాయన్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం అంటే ప్లాస్టిక్ బియ్యం అంటూ వచ్చే వదంతుల్లో నిజం లేదన్నారు. నీటితో కడిగిన తర్వాత పైకి తేలే బియ్యం ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే అన్నారు. ఆగస్టు నుంచి ఈ బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు.

కాలువలకు పూర్తి స్థాయిలో నీటి విడుదల

నిడదవోలు: వారం రోజులుగా వర్షాలు కురవక పోవడంతో పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల్లోని మూడు డెల్టాల పరిధిలోని రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం కాలువలకు పూర్తిస్థాయిలో నీటి విడుదల చేస్తున్నారు. నీటి పారుదల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను శుక్రవారం నుంచి పెంచారు. పశ్చిమ డెల్టాకు 7,500, మధ్య డెల్టాకు 2,600, తూర్పు డెల్టాకు 4,900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 903, తణుకు కాలువకు 786, అత్తిలి కాలువకు 590 , నరసాపురం కాలువకు 2168 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హరిబాబు

దేవరపల్లి: కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని దుద్దుకూరుకు చెందిన కాకర్ల హరిబాబు నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి గుర్నాథరావు హరిబాబుకు నియామక ఉత్తర్వులు అందజేశారు. శుక్రవారం దుద్దుకూరులోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరిబాబు మాట్లాడారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

దేవరపల్లి: భార్యతో గొడవపడి మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి ఉప్పల శ్రీను (46) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని త్యాజంపూడికి చెందిన శ్రీను మద్యానికి బానిసయ్యాడు. పనికి వెళ్లడం లేదు. తాగి ఇంటికి వచ్చి తరచూ భార్య రామలక్ష్మితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా భార్యతో కొంతసేపు గొడవపడ్డాడు. అనంతరం అతడు మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని గోపాలపురంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్టు ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పాలకుల అండతో.. సొంతింటి నీడలో..

- మండలంలో 1,490 గృహాల నిర్మాణం
- నిర్మాణ దశల్లో మరో 1,939
- తీరనున్న పేదల అద్దె కష్టాలు


చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం లే అవుట్‌లో ఇంటి నిర్మాణాలు

చాగల్లు: పేదలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సొంతింటి కలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సాకారం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పేదల కోసం లక్షలాది గృహాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. గ్రామ సచివాలయాల ద్వారా అర్హులను గుర్తించి అవసరమైన వారికి ఇప్పటికే జగనన్న లేఅవుట్లలో స్థలాలు పంపిణీ చేశారు. వాటిలో ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరోపక్క రూపుదిద్దుకుంటున్న జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. తమ సొంతింటి కల కార్యరూపం దాలుస్తుండడంతో పేదల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. కొవ్వూరు నియోజకవర్గంలోని మొత్తం 56 జగనన్న లేఅవుట్లలో 7,386 మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. చాగల్లు మండలంలోని 23 లేఅవుట్లలో 1749 మందికి స్థలాలు కేటాయించి, పక్కా గృహాలు మంజూరు చేశారు. మండలంలో సొంత స్థలాలు ఉన్న మరో 1671 మందికి కూడా ప్రభుత్వం గృహాలు కేటాయించింది. మండలానికి మంజూరైన మొత్తం 3420 గృహాల్లో ఇప్పటి వరకూ 1490 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. కాగా


బంగ్లా కాదు.. నెలటూరు కాలనీలోని జగనన్న గృహం

గత తెలుగుదేశం ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో మండలానికి 1326 గృహాలు మాత్రమే మంజూరయ్యాయి. వాటిలో 1205 గృహాల నిర్మాణం మాత్రమే పూర్తయ్యాయి. వాటికే బిలులు చెల్లించారు.

ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు

ఇంటి నిర్మాణంలో పేదలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని చర్యలూ చేపట్టింది. జగనన్న గృహ నిర్మాణ పథకంలో ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున మంజూరు చేస్తోంది. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న లబ్ధిదారులకైతే అదనంగా మరో రూ.35 వేల బ్యాంక్ రుణంగా అందిస్తోంది. సిమెంట్, స్టీల్ వంటి నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై అందిస్తోంది. ఇసుక ఉచితంగా అందిస్తోంది. జాప్యం చేయకుండా బిల్లులను చెల్లిస్తున్నారు. నిర్మాణ మెటీరియల్ వ్యయాన్ని మినహాయించి మూడు దశల్లో బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రతి లబ్ధిదారుడూ ఇంటి నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసుకునేందుకు గృహ నిర్మాణ శాఖ, సచివాలయ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. ఇంటి నిర్మాణాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు అన్ని లేఅవుట్లలోనూ బోర్లు వేశారు. విద్యుత్తు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని సొంత స్థలం వచ్చింది. స్థలంతో పాటు పక్కా గృహం కూడా మంజూరైంది. దాదాపు పదేళ్లుగా అద్దె ఇళ్లలో నివశిస్తున్నాం .చాలా కాలం తరువాత ప్రభుత్వం పక్కా ఇంటిని కేటాయించడం సంతోషంగా ఉంది.

– ఎం.సూర్యావతి, బ్రాహ్మణగూడెం

చాలా కాలంగా అద్దె ఇంట్లోనే..



కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. చాలా కాలంగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చలువతో జగనన్న లే అవుట్‌లో స్థలంతో పాటు పక్కాగృహం కూడా మంజూరైంది. ఇంటి నిర్మాణానికి అధికారులు అన్ని వసతులూ కల్పిస్తున్నారు.

– కె. సింధూజాబేబీ, బ్రాహ్మణగూడెం

ఇంటి నిర్మాణం పూర్తయ్యింది



జగనన్న కాలనీలో మాకు స్థలాన్ని, ఇంటిని ప్రభుత్వం ఉచితంగా ఇచ్చింది. అందరి సహకారంతో ఇంటి నిర్మాణం పూర్తయ్యింది. సొంతింటి కల తీరదనుకున్న మాకు ప్రస్తుత ప్రభుత్వం అండగా నిలిచి, కల నెరవేరేలా చేసింది.

– ప్రగడా కనకదుర్గ, నెలటూరు

కాలనీలకు ఆర్చ్‌లు ఏర్పాటు చేస్తున్నాం



జగనన్న కాలనీల వద్ద ఆర్చిలను ఏర్పాటు చేస్తున్నాం. లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొనేలా అవగాహన కల్పిస్తున్నాం. కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పురోగతిని వర్క్ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తున్నారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకుంటూ నిర్మాణాలకు అటంకాలు లేకుండా చూస్తున్నాం. బిల్లుల మంజూరు, నీటి వసతి, ఇతర సమస్యలు లేకుండా చూస్తున్నాం.

– కె.వెంకటరమణ, హౌసింగ్ ఏఈ, చాగల్లు మండలం

అభివృద్ధి, సంక్షేమం సర్కార్‌కు రెండు కళ్లు

- కొవ్వూరులో హోం మంత్రి వనిత, నిడదవోలులో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- రెండు పట్టణాల్లో గడప గడపకూ..

కొవ్వూరు: సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని ఒకటో వార్డు రాజీవ్ కాలనీలో 116వ రోజు శుక్రవారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వలలు తయారు చేసుకుంటున్న మత్స్యకారులతో కొద్దిసేపు మంత్రి వనిత ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్న వ్యాన్ వద్దకు వెళ్లి సరుకుల సరఫరా తీరు గురించి అక్కడ ఉన్నవారిని ఆమె అడిగి తెలుసుకున్నారు.మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, స్థానిక వార్డు నాయకులు పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్, నేతల వెంకటేష్, మాసా ఆనంద్, వేము వెంకటరత్నం, మునిసిపల్ వైస్ చైర్పర్సన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్ష, గౌరవాధ్యక్షులు రుత్తల భాస్కరరావు, నగళ్లపాటి శ్రీనివాస్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కొవ్వూరు ఒకటో వార్డు వాసులకు పథకాల లబ్ధిని వివరిస్తున్న హోం మంత్రి తానేటి వనిత


నిడదవోలు 26వ వార్డులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

నిడదవోలు 26వ వార్డులో..

నిడదవోలు: అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో శుక్రవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎవరికైనా అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయాలను సంప్రదించాలని కోరారు. పథకాల కోసం ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్ పర్సన్‌లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కమిషనర్ కేవీ పద్మావతి, కౌన్సిలర్లు తోలేటి ఝాన్సీ, ఆలమూరి భారతి, కామిశెట్టి వెంకట సత్యనారాయణ, కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, బిర్రే పార్వతి, ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు, ఆకుల ముకుందరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, గుర్రం శాంతిశ్రీ , అహ్మదున్నీషాబేగం , వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామకంఠం నివాసితులకు హక్కు పత్రాలు

- హోం మంత్రి తానేటి వనిత
- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ప్రారంభం


శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా వందేళ్ల తర్వాత గ్రామ కంఠం భూముల్లోని నివాసాలకు యాజమాన్య ఆస్తి హక్కు ధ్రువపత్రాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని లిటరరీ క్లబ్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ప్రారంభోత్సవ సభలో మంత్రి మాట్లాడారు. గ్రామకంఠంలో నివశిస్తున్న అర్హులందరికీ స్వమిత్ర శాశ్వత భూమిహక్కు కల్పించేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేపట్టిందన్నారు. ఈ హక్కు పత్రాల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు, క్రయవిక్రయాలకు అవకాశం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఐదు గ్రామాల్లో ఈ సర్వే ద్వారా 1,074 మందికి యాజమాన్య హక్కు పత్రాలు అందిస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా స్వమిత్ర కార్యక్రమం ద్వారా సాగు, మునిసిపల్ భూములు, గ్రామ కంఠం సర్వే నిర్వహిస్తున్నారన్నారు. సర్వే అనంతరం ఆ యజమానికి సర్టిఫికెట్ ఆఫ్ ఓనర్ షిప్ అందజేస్తామన్నారు.అనంతరం తోగుమ్మి, చిడిపి, నందిగంపాడు, బల్లిపాడు, నెలటూరు, గ్రామాల లబ్ధిదారులకు మంత్రి వనిత, జేసీ తేజ్ భరత్ చేతుల మీదుగా హక్కు పత్రాలు పంపిణీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారి జానా సత్యనారాయణ, డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ, స్వమిత్ర నోడల్ అధికారి ఎం.పద్మజ, తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, నాయకులు ఉప్పులూరి సూరిబాబు, ఎంపీడీవో కె.సుశీల, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల అనుబంధ కమిటీల ఏర్పాటు


నల్లజర్ల మండల అనుబంధ కమిటీలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు


వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం


ఈలప్రోలు చంద్రరావు


చేబ్రోలు బాలాజీ

దేవరపల్లి/ నల్లజర్ల: వైఎస్సార్ సీపీ నల్లజర్ల మండల అనుబంధ కమిటీలను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రకటించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పార్టీ ప్రధాన కమిటీ, అనుబంధ కమిటీలను నియమించి, 2024 సార్వత్రిక ఎన్నికలకు పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేస్తామని ఆయన చెప్పారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లజర్ల మండల అనుబంధ కమిటీలను ఆయన ప్రకటించారు. పార్టీ మండల కన్వీనర్‌గా గగ్గర బాలచంద్రశ్రీనివాస్, యూత్ కన్వీనర్‌గా చేబ్రోలు బాలాజీ, మండల మహిళా కన్వీనర్‌గా నూతలపాటి కృష్ణవేణి, బీసీ సెల్ కన్వీనర్‌గా రుద్రబోయిన నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ కన్వీనర్‌గా యంట్రపాటి మంగరాజు, విద్యార్థి విభాగం కన్వీనర్‌గా టపా అజయ్, రైతు విభాగం కన్వీనర్‌గా ఈలపోలు చంద్రం, మైనార్టీ సెల్ కన్వీనర్‌గా మహ్మద్ సరాజుద్దీన్, సేవాదళ్ కన్వీనర్‌గా నక్కా నాగసత్యనారాయణ, ప్రచార కమిటీ కన్వీనర్‌గా కోరుకొండ శ్రీనివాసరావు, సోషల్ మీడియా కన్వీనర్‌గా గొర్రెల సాంబయ్య, వాణిజ్య విభాగం కన్వీనర్‌గా మోతుకూరి శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా తలంశెట్టి మాధవరావు, పంచాయతీరాజ్ విభాగం కన్వీనర్‌గా వెల్లంకి వెంకటసుబ్రహమణ్యం, క్రిస్టియన్ విభాగం కన్వీనర్‌గా కవ్వలూరి సుధాకర్, లీగల్ సెల్ కన్వీనర్‌గా గోగులమండ బాబ్జిని నియమించినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి తొమ్మండ్రు రమేష్, నల్లజర్ల సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, పోతవరం సొసైటీ అధ్యక్షులు పెండ్యాల హరే రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులకు పండ్లు పంపిణీ

ఉండ్రాజవరం: పాలంగి గ్రామంలోని స్పందన మానసిక దివ్యాంగుల కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు శుక్రవారం పండ్లు పంపిణీ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా రేలంగి క్రైస్ట్ చర్చ్, జయశాలి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ ఇండియా ఇంటర్నేషనల్ అడిషనల్ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.జాన్ ప్రసాద్ చేతుల మీదుగా వారికి పండ్లు అందించారు. చెట్టే శ్యాం ప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సున్నా వడ్డీ లబ్ధి రూ.2.24 కోట్లు

నిడదవోలు రూరల్: సకాలంలో బ్యాంకు రుణాలు చెల్లించిన డ్వాక్రా సంఘాల సభ్యులకు వడ్డీ భారం పడకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగో ఏడాది కూడా వైఎస్సార్ సున్నా వడ్డీని రీయింబర్స్ చేశారని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని 22 సచివాలయాల్లో వైఎస్సార్ సున్నా వడ్డీపై డ్వాక్రా సభ్యులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని 1608 డ్వాక్రా సంఘాలకు రూ.2.24 కోట్ల లబ్ధి చేకూరిందని ఏపీఎం శ్యామ్ తెలిపారు. తాడిమళ్లలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, తిమ్మరాజుపాలెంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ ఎం.చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, విజ్జేశ్వరంలో సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, గోపవరంలో వైఎస్సార్ సీపీ నాయకులు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో దాతలు చల్లపల్లి శ్రీధర్, కృష్ణవేణి దంపతుల ఆర్థిక సహకారంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, రోటరీ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, కార్యదర్శి గుంటుపల్లి వెంకట నాగశివ కుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు, పొన్న సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

జెడ్పీ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ


పోతవరం హైస్కూల్‌లో విద్యార్థినులతో జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ తదితరులు

నల్లజర్ల: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. మండలంలోని పోతవరం జెడ్పీ హైస్కూల్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఇక్కడ జరుగుతున్న నాడు–నేడు రెండో దశ పనులను పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. పాఠశాల వాతావరణం, మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్, విద్యా బోధనలపై విద్యార్థినులను అడిగి తెలుసు కున్నారు. పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలని, అందుకు అవసరమైన వసతులు కల్పించే బాధ్యత తమదని చెప్పారు. కొంత కాలంగా హిందీ ఉపాధ్యాయులు లేరని విద్యార్థులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే పద్మశ్రీ జిల్లా అధికారులతో మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి విజ్ఞప్తి మేరకు పాఠశాల భవనం పైభాగంలో అసంపూర్తిగా ఉన్న 5వ తరగతి గదులను పూర్తి చేయడానికి రూ.రెండు లక్షలు కేటాయిస్తున్నట్టు పద్మశ్రీ ప్రకటించారు. హెచ్ఎం గోపి గోవర్ధన్, సర్పంచ్ నూతి కుర్తి లక్ష్మణరావు, ముప్పిడి వెంకటరత్నం, సమగ్రశిక్షా అభియాన్ ఏఈ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తొమ్మిది వార్డులకు 29 నామినేషన్లు

- అన్నీ సవ్యంగా ఉన్నాయన్న అధికారులు
- పూర్తయిన నామినేషన్ల పరిశీలన

కొవ్వూరు: డివిజన్‌లోని ఆరు మండలాల్లో తొమ్మిది పంచాయతీ వార్డు మెంబర్ పదవుల కోసం మొత్తం 29 నామినేషన్లు దాఖలవగా, పరిశీలనలో అన్నీ సవ్యంగానే ఉన్నాయని డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ తెలిపారు. ఐ.పంగిడి ఎనిమిదో వార్డుకు అత్యధికంగా ఆరు నామినేషన్లు దాఖలయ్యాయి. గోపాలపురం 16వ వార్డుకు ఐదు,12వ వార్డుకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. దమ్మెన్నులో తొమ్మిదో వార్డుకి ఐదు, అజ్జరం రెండో వార్డుకి, పురుషోత్తపల్లి ఏడో వార్డుకి మూడేసి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. పురుషోత్తపల్లి తొమ్మిదో వార్డు, కాటకోటేశ్వరం ఒకటో వార్డు, కె.సావరం 11వ వార్డుకి ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. ఒక్కొక్క నామినేషన్ దాఖలైన మూడు వార్డులు ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.14వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. అనంతరం బరిలో నిలిచే వారి జాబితా ఖరారవుతుంది.

స్వాతంత్య్ర యోధుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- పలుచోట్ల ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు
- శిలాఫలకాల ఆవిష్కరణ, ప్రతిజ్ఞ
- వన మహోత్సవాలు

నిడదవోలు: స్వాతంత్య్ర సమర యోధుల త్యాగాలను మననం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా నిడదవోలు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మా భూమి– నాదేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడితో పాటు కౌన్సిలర్లు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్న వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, వైస్ చైర్ పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గోపాలపురం: దేశం కోసం పోరాడిన త్యాగధనులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. నాభూమి– నాదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని చిట్యాల గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం మొక్కలు, నాటి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు బూసి బేబీ, వైఎస్సార్ సీపీ నాయకులు పీతల ప్రసాద్‌బాబు, ముచ్చికర్ల రవి, పెనుగొండ బాలాజీ, ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.


నిడదవోలు మున్సిపల్ ఆఫీసు వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు


గోపాలపురం మండలం చిట్యాలలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నిడదవోలు రూరల్: ఆజాదీకా అమృత్ మహోత్సవాల్లో భాగంగా నాభూమి– నాదేశం, నేల తల్లికి నమస్కారం– వీరులకు వందనం కార్యక్రమాలు తిమ్మరాజుపాలెంలో సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వాతంత్య్ర సమరయోధుల స్థూపం వద్ద నివాళులర్పించి గ్రామంలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పడాల శ్రీను పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక సచివాలయం వద్ద నాభూమి– నాదేశం, నేల తల్లికి నమస్కారం– వీరులకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ యాళ్ల బాబురావు, పంచాయతీ కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.